# పరాయి సిరా

అనువాద కథలు

## స్వేచ్ఛానువాదం–మల్లాది వెంకట కృష్ణమూర్తి



### చిన్నమాట

*కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజిలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.*

*కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణీ చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.*

*తెలుగులో ఆ950–ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.*

*విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.*

*చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.*

*అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...*

*మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.*

# ఎవరు?
# (ఛార్లొట్ ఆరంస్ట్రాంగ్ కథకి స్వేచ్ఛానువాదం)

*(కథాకాలం జూలై 1959)*

**నలభై తొమ్మిదే**ళ్ళ అమోస్ పోల్కింగ్‌హోన్ రచయిత, డేనియల్ డీన్ అనే గొప్ప డిటెక్టివ్ సృష్టికర్త. ఆ రోజు అమోస్ ఇంట్లోంచి బయటకి వచ్చి పోస్ట్‌మేన్ కోసం చూస్తూ పక్కింటి కిటికీ తెరల వెనక అద్దం మీద కొన్ని చేతివేళ్ళని చూసి ఉలిక్కిపడ్డాడు. కారణం ఆ ఇంటి సభ్యులైన మిస్టర్ అండ్ మిసెస్ ఆర్నాల్డ్, తమ కొడుకు బాబ్, కూతురు జేనీలతో రెండువారాలు శెలవలు గడపడానికి సముద్రపు ఒడ్డున ఓ రిసార్ట్‌కి వెళ్ళారు. వారితో గుడ్ మార్నింగ్ వరకే తప్ప అమోస్‌కి పెద్దగా పరిచయం లేదు. కాని వాళ్ళు వెకేషన్‌కి వెళ్ళారని అతనికి తెలుసు. కాబట్టి అది ఖాళీగా ఉండాలి. మరా చేతి వేళ్ళు ఎవరివి? కల్పిత డిటెక్టివ్ డేనియల్ డీన్ అలా ఉలిక్కిపడేవాడు కాదు కాని దాని సృష్టికర్త నోరెండిపోయి, కాళ్ళు వణికి, గుండె వేగంగా కొట్టుకోసాగింది. తన ఇంట్లోకి వెళ్ళి ఓ నిమిషం తర్వాత తేరుకుని పోలీసులకి ఫోన్ చేసాడు. వాళ్ళు వచ్చేలోగా అతనికా వ్యక్తి ఎవరో తెలుసుకునే ఒక్క ఆధారం కూడా తట్టలేదు.

ఈలోగా పోస్ట్‌మేన్ వచ్చాడు కానీ అమోస్‌కి ఉత్తరాలు రాలేదు. తన కొత్త కథ తిరస్కరించబడదనే ఆశ అతనిలో పెరిగింది. కొద్దిసేపటికి మఫ్టీలో ఉన్న ఇద్దరు పోలీసులు కానర్స్, ఫార్లే వచ్చారు. వాళ్ళు ఎలాంటి పథకాన్ని అమలు పరచకుండా అర్నాల్డ్ ఇంటి వెనక తలుపు తెరచుకుని లోపలకి వెళ్ళారు. అమోస్ డిటెక్టివ్ కథలు రాస్తాడని తెలుసు కాబట్టి, పైగా ఫిర్యాదుదారు కాబట్టీ అతన్నికూడా వెంట తీసుకెళ్ళారు. లోపల ఎవరూ లేరు.

అమోస్ డేనియల్ డీన్‌లా ఆలోచించసాగాడు కిచెన్ టేబుల్ మీది టోపీని అందుకుని కానర్స్ చెప్పాడు.

"ఇది జిల్లా జైల్లోని ఖైదీలు ధరించేది. పదిరోజుల క్రితం ముగ్గురు దొంగలు తప్పించుకున్నారు. ఇద్దరు దొంగలు వారం క్రితం ఓ రాత్రి నది ఒడ్డున ఓ పడవని దొంగిలించి దాంట్లో పారిపోయారు. వాళ్ళ జైలు దుస్తుల్ని ఓ సాక్స్ ని చూసాడు. ఆ పడవ మధ్యలో మునిగిపోయింది. రాత్రంతా వాళ్ళు శవాల కోసం వెదికినా ఇంతదాకా దొరకలేదు. వాళ్ళు తీరాన్ని చేరిన దాఖలాలు కూడా లేవు. కాబట్టి ఆ ముగ్గురిలో ఇద్దరు పోయారనే అనుకుంటున్నాం. ఈ టోపీ ఆధారంగా మూడోవాడు ఈ ఇంట్లో గత వారంగా దాక్కుని ఉంటాడని ఊహించవచ్చు. ఐతే ఆ ముగ్గురిలో ఎవరన్నది ప్రశ్న."

"అది ముఖ్యమా?" అమోస్ ఆలోచనగా అడిగాడు.

"ముఖ్యం. ఎవరు జీవించి ఉన్నారో తెలుసుకుంటే వారికోసం వెదకడం తేలిక" ఫార్లే చెప్పాడు.

"పాయింటే"

"నలభై నిమిషాల్లోపు మీరు ఈ ఇంటి కిటికీ అద్దం మీద మనిషి వేళ్ళని చూసారు. ఈలోగా వాడు ఎక్కువ దూరం పారిపోలేదు. మేం ఎవరికోసం వెదుకుతున్నామో తెలిస్తే బావుండును" కాన్సర్స్ చెప్పాడు.

"ఆధారాలని పట్టుకోగలిగితే తెలియచ్చు. అసలు ఈ ఇల్లు ఖాళీగా ఉందని వాడికి ఎలా తెలిసింది?" అమోస్ అడిగాడు.

"ఆర్నాల్డ్ భార్య వెనక తలుపుకి పాలవాడి కోసం పది రోజులు పాలొద్దు. 12వ తారీకు మంగళవారం వెనక్కి వస్తాం అని రాసిన కాగితం ఉంచింది" కానర్స్ చెప్పాడు.

"అంటే రేపే" ఫార్లే చెప్పాడు.

"మనకో ఆధారం దొరికింది" అమోస్ ఉత్సాహంగాచెప్పాడు.

"ఏమిటది?"

"మనం వెతకాల్సింది చదువు వచ్చినవాడి కోసం."

"ఆర్నాల్డ్‌కి ఫోన్ చేసాం. ఒకటి, రెండు గంటల్లో వస్తారు. ఇంట్లో ఏమైనా పోయాయేమో చూసి చెప్పగలిగేది వాళ్ళే"ఫార్లేచెప్పాడు.

"ఈ లోగా మనం ఆధారాల కోసం ఇల్లంతా వెదుకుదాం. వారంపాటు ఓ మనిషి ఉన్న ఇంట్లో వాడు ఆధరాలు వదలకుండా వెళ్ళలేదు. మీరా ముగ్గురు ఖైదీల గురించి చెప్పగలరా?" అమోస్ అడిగాడు.

అతనికి ఓ కేస్‌ని తను డిటెక్టివ్‌లా పరిశోధిస్తున్నందుకు సంతోషం వేసింది. తనకి పబ్లిసిటీ వస్తుంది.

"ప్రఖ్యాత డిటెక్టివ్ రచయిత అని జీవితంలో ఓ పోలీస్ సమస్యని పరిష్కరించాడు" లాంటి హెడ్డింగ్‌ని ఊహించాడు. జేబులోంచి పెన్, పేపర్ తీసాడు.

"వారిలోని ఒకరు మేరియో కోసెటి. వయసు ఇరవై తొమ్మిది. కాకేషియన్. ఐదంగుళా ఎత్తు. సుమారు అరవై అయిదు కిలోల బరువు. నల్లజుటు. నల్ల కళ్ళు. కుడికాలు చెక్కకాలు. నేవీలో పని చేసాడు. యుద్ధంలో కాలు పోయింది. ఆయుధంతో దొంగతనం నేరం మీద పట్టుబడ్డాడు."

"ఇలాంటి సమాచారమే నేను అడిగింది.అతని నేపథ్యం?"

“న్యూయార్క్ సిటీలో లోయర్ ఈస్ట్ సైడ్లో ఉండేవాడు. హై స్కూల్ చదువుతో ఆపేసాడు. రెండోవాడు గ్లెన్‌వే స్పారో. వయసు నలభై రెండు. కాకేషియన్. ఎత్తు ఐదు పదకొండు. ఏభై ఐదు కిలోపైక బరువు. బూడిద రంగు కళ్ళు. అదే రంగు జుట్టు. మాజీ సంపాదకుడు. కాలేజీలో చదివాడు. మోసగాడు. ఓ మోసంలో పట్టుబడ్డాడు. ఇతనికి జడ్జ్ మీద చాలా కోపం ఉంది. ముగ్గురిలోకి తెలివైనవాడు. తన ఆరోగ్యం గురించిన భయాలు ఉన్నాయి."

అమోస్ కాగితం మీద ఆ సమాచారం అందమైన చేతిరాతలో రాసుకుంటున్నాడు. కానర్స్ తను చెప్పేది కొనసాగించాడు.

"మూడో వాడు మేథ్యూ హూస్. ఇరవై నాలుగేళ్ళ అతని ఎత్తు ఆరు ఒకటి. తొంబై కిలోల బరువు. ఎర్రజుట్టు. నీలిరంగు కళ్ళు. రెండేళ్ళు ఆర్మీలో పనిచేసాడు. కెంటకీ లోని ఓ బార్లో పోట్లాటలో ఒకడ్ని చంపి అరెస్ట్ అయ్యాడు ఉద్యోగం లేదు."

"ఏమంటారు మిస్టర్ అమోస్? లేదా డేనియల్ డీన్ ఏమంటాడు?" ఫార్లే నవ్వుతూ అడిగాడు.

"డేనియల్ డీన్ ఇల్లంతా తిరిగి పరిశీలిస్తాడు. నేనా పని చేయచ్చా?"

అమోస్ ఆ ఇంట్లోని ప్రతి గదీ తిరుగుతూ జాగ్రత్తగా చూస్తూ తీవ్రంగా ఆలోచించసాగాడు. ఆ పెద్ద ఇంట్లో చాలా సామానుంది. తర్వాత ఫార్లే ఆవులిస్తూ అడిగాడు.

"ఏం కనుక్కున్నారు?"

అమోస్ ఓ కాగితం ఉండని విప్పితీసి పెన్సిల్‌తో అస్పష్టంగా రాసిన వాక్యాన్ని చదివాడు.

"టా, మే లెట్ ఐ డి టు బట్ ఏ ఎస్‌పి సేన్ బేగ్"

"ఇదెక్కడ దొరికింది?" ఫార్లే అర్థం లేని ఆ వాక్యాన్ని విని అడిగాడు.

"ఓ కుర్చీకింద. ఇది కోడ్‌లో రాసింది. ఇది స్పారో రాసాడని నా నమ్మకం. ఎందుకంటే అతను తెలివిగలవాడు. లివింగ్ రూములోని పుస్తకాల షెల్ఫ్‌లో ఓ కాటన్ సాక్‌ని గమనించారా? కొత్తది, శుభ్రమైంది, వాడని అది నీలం, తెలుపు కాటన్ సాక్" ఆగి వాళ్ళ వంక ప్రశ్నార్థకంగా చూసాడు.

ఆ ఇద్దరు మాట్లాడలేదు.

"ఆ ఒక్క సాకే ఎందుకు ఉంది? ఒకే కాలుగల కోసెటి ఇక్కడికి వచ్చాడా? చెక్క కాలుకి సాక్ అనవసరం అనుకుంటున్నాడా?" అమోస్ ప్రశ్నించాడు.

"మీరు చెప్పింది అర్థమైంది" కాన్సర్స్ కొద్దిగా ఉత్సాహంగా చెప్పాడు.

"నేను కనుక్కున్న పది ఆధారాల్లో మరో రెండు కూడా కోసెటి ఇక్కడికి వచ్చాడని చెప్తున్నాయి. ఒకటి మేథ్యూ హూస్‌ని చూపిస్తోంది. మరొకటి దాన్ని తొలిగిస్తోంది. మిగిలిన ఐదూ స్పారోనే సూచిస్తున్నాయి."

"అంటే స్పారో ఇక్కడికి వచ్చాడంటారా?"

"నన్ను పూర్తి చేయనివ్వండి. ముందు కోసెటి గురించి. కిచెన్ టేబుల్ మీద ఏడు ఖాళీ కేన్స్‌ని మీరు గమనించి ఉంటారు. వాటిని తిన్న వ్యక్తి వాటిని చెత్త డబ్బాలో వేయకపోవడానికి కారణం ఇంట్లో ఎవరో ఉన్నారని తెలుసుకోకూడదని అవన్నీ స్పగెటి కేన్స్."

"ఇటాలియన్. అంటే కోసెటి" ఫార్లే మెచ్చుకోలుగా చెప్పాడు.

"అవును. డైనింగ్ టేబుల్ కింద మూడు నెక్‌టైలని తాడులా కట్టి ఉండటం మీరు చూసారా?"

"నేను చూసాను. అదేం చెప్తోంది?" కానర్స్ ప్రశ్నించాడు.

"ఆ ముళ్ళని గమనించారా? ఒకోటి ఒకో రకం ముడి. నేవీలో పనిచేసే వాళ్ళకి అనేక రకాల ముళ్ళు తెలుస్తాయి. కోసెటి నేవీలో పనిచేసాడని చెప్పారు కదా?"

ఆ ఇద్దరి మొహాల్లో ఎలాంటి భావాలు కనపడకపోవడంతో వాళ్ళు నిర్ఘాంతపోయారని అమోస్ భావించాడు.

"కోసెటినీ కొద్దిసేపు వదిలేసి మేథ్యూ హౌస్‌ని తీసుకుందాం. ఖాళీ లిక్కర్ సీసాని గమనించారా? ఒకే ఖాళీ సీసా. ఆర్నాల్డ్ లిక్కర్ షెల్ఫ్‌లోంచి బౌర్బన్ బాటిల్‌నే తీసి తాగారు."

"కెంటకీ" ఫార్లే చెప్పాడు.

ఆ ఇద్దరూ ఒకరి వంక మరొకరు చూసుకుని కన్నుకొట్టడం అమోస్ గమనించాడు.

"మళ్ళీ స్పారో దగ్గరకి వద్దాం. ఇంట్లోని ఏ పక్కమీది దుప్పటీ చెదరలేదు. ఇంట్లోని వ్యక్తి మంచాల మీద కాక సోఫాల మీద పడుకున్నాడు. ఎవరైనా వస్తే పారిపోవడం తేలిక కాబట్టి. దానిమీది దిండు నలిగి ఉండటం గమనించారా? దాని పక్కనే ఉన్న కాఫీ టేబుల్ మీది ఏస్ప్రిన్ సీసా ఖాళీగా ఉంది. ఆ ముగ్గురిలో ఆరోగ్యం బావుండనిది ఒక్క స్పారోకి కదా? సోఫా పక్కన నేల మీద పాత పత్రికలని గమనించారా? కత్తెరని? వాటిలోంచి చిన్న ముక్కలు కత్తిరించబడ్డాయి. స్పారోకి జడ్జ్ మీద కోప ఉందని చెప్పారు కదా? ఆయనకో బెదిరింపు లేఖని స్పారోని రాస్తాడు. పత్రికలోని అక్షరాలని కత్తిరించి అతికించి బెదిరింపు లేఖలని రాయడం గురించి మీరు విని ఉంటారు. ఇన్ని రోజులూ ఒంటరిగా ఎలా గడిపి ఉంటాడు?" అమోస్ ప్రశ్నించాడు.

"స్పగెటీని తింటూ" ఫార్లే ఆవలింతని ఆపుకుంటూ చెప్పాడు.

"పగలు అతను చదువుతూ గడిపాడు. ఎలాంటివి? మేధావులు చదివే పుస్తకాలు. ఉదాహరణకి ది సీక్రెట్ హిస్టరీ ఆఫ్ ది అమెరికన్ రివల్యూషన్, ది కంప్లీట్ వర్క్స్ ఆఫ్ విలియం షేక్స్‌పియర్. ఇలాంటి ఆరు పుస్తకాలు లివింగ్ రూములోని బల్లమీద ఉన్నాయి. పుస్తకాల షెల్ఫ్‌లో అవి తీసిన చోట ఖాళీ కూడా గమనించాను. ఇంకో క్లూ బట్టలు. జిల్లా జైలు టోపీ తప్ప జైలు దుస్తులు లేవు. అర్నాల్డ్ లావు మనిషి. అర్నాల్డ్ దుస్తులని అతను ధరించలేదు."

"ఎలా చెప్పగలరు?" కానర్స్ అడిగాడు.

"విడిచినవి ఎక్కడ వదిలాడు? కోసెటి పొట్టివాడు. ఐదు ఐదు. స్పారో కూడా బాగా సన్నం. హౌస్‌కి పట్టవు. అందువల్ల ఎవరూ వేసుకుని ఉండరు."

"ఇంతకీ ఇక్కడ ఎవరు దాక్కున్నట్లు?" కానర్స్ అపనమ్మకంగా అడిగాడు.

"పది ఆధరాలు. ఒక కాలు సాక్, స్పగెటి, నెక్‌టై తాడు ముళ్ళు. ఇవి కోసటి అయుండచ్చని చెప్తున్నాయి. కాకపోతే నేవీకి చెందిన కొసెటి పడవలో పారిపోవడానికి ఇష్టపడతాడు. కాబట్టి అది ఈ ఆధారాలని రద్దు చేస్తోంది."

"కోసేటి ఆ పడవలో ఉంటే అది ఎలా మునుగుతుంది? అతను పడవని నడపడంలో నిపుణుడు కదా?" ఫార్లే క్షమాపణగా అడిగాడు.

"బౌర్బన్ విస్కీ లీలగా మేథ్యూ హౌస్ వైపు చూపిస్తున్నా అతను దుస్తులు ఇక్కడ వదలకపోవడంతో అతను కాదు. ఈ కోడ్ మెసేజ్ మేథావులు చదివే పుస్తకాలు, కత్తిరించిన పత్రికలు, ఖాళీ ఏస్ప్రిన్ సీసా అన్నీ స్పారో ఇక్కడ ఉన్నాయని చెప్తున్నాయి. దీందో అది స్థిరపడుతుంది" అమోస్ చెప్పాడు.

"దేంతో?" ఇద్దరు అడిగారు.

"ఇది లివింగ్ రూములోని ఆకుపచ్చ రంగు సోఫాలోంచి వచ్చింది. బూడిద రంగు జుట్టు. కోసెటీది నల్లజుట్టు. హూస్‌ది ఎర్రజుట్టు. అందువల్ల స్పారో అయి ఉంటాడు."

వాళ్ళు తను చెప్పేది నమ్మడం లేదని గ్రహించిన అమోస్ వాళ్ళకన్నా తను తెలివిగా ఆలోచించడం వాళ్ళు భరించలేక పోతున్నారని అనుకున్నాడు.

"కారు చప్పుడు వినిపిస్తోంది. ఆర్నాల్డ్ అమోస్‌ని చూసి నవ్వుతూ పలకరించాడు.

"హలో అమోస్! మీరు ఈ నేరం మీద మీ మెదడుకి పదును పెడుతున్నారని పోలీసులు చెప్పారు."

ఫార్లే ఆ పుస్తకాల్ అగురించి అడిగితే ఆర్నాల్డ్ చెప్పాడు.

"నన్నేమీ అడక్కండి. నాకేమీ తెలీదు. అన్నీ కీట్టీకే తెలుస్తాయి. నేను చేసేదల్లా ఇంటద్దె చెల్లించడమే."

"కనీసం బౌర్బన్ సీసా గుర్తించైనా చెప్తారా?" అమోస్ ప్రశ్నించాడు.

"నాకది అప్డదు" అర్నాల్డ్ వెంటనే చెప్పాడు.

"అంటే మీరు దాన్ని తాగలేదా?"

"ఇదా? దాన్ని చెత్తబుట్టలో వేయడం మర్చిపోయాను. మేం వెళ్ళేముందు రాతి మా ఆఫీస్ నించి వచ్చిన ఒకతనికి ఇది ఇష్టంకాఅబ్టీ అతనికి ఇచ్చాను. ఇదంతా ఏమిటి?"

వెనక తలుపులోంచి ఆర్నాల్డ్ భార్య, కిట్టీ, ఇద్దరు పిల్లలు వచ్చారు. కిట్టీ చేతిలో చాలా కవర్లు ఉన్నాయి.

"వీటిలో తొంభై శాతం చెల్లించాల్సిన బిల్సే అని పందెం. హలో అమోస్. ఇల్లంతా వెదికాను. ఒక్కటీ పోలేదు. కేన్స్ మాత్రం ఖాళీ అయ్యాయి. అది తప్పించుకున్న ఖైదీ పనా? వెళ్ళిపోయాడా? సెల్లార్లో దాక్కున్నాడేమో చూసారా?" అడిగింది.

"చూసాం లేదు. మీవారి బట్టలేమీ పోలేదుగా?" బౌర్బన్ ఆధారాన్నికొట్టేసాక అమోస్ జాబితాలోని ఆధారాలని చూస్తూ అడిగాడు.

"ఏం పోలేదు."

"నా నీలం రంగు సూటేది?" అర్నాల్డ్ వెంటనే అడిగాడు.

"వెళ్ళబోయే ముందు లాండ్రీకి వేసాను. నేరస్థుడు ఇక్కడ లేనప్పుడు మీరింకా ఏం ఆలోచిస్తున్నారు?"

అమోస్ పారిపోయిన ముగ్గురిలో ఎవరు ఇక్కడ దాక్కున్నాడో కనిపెట్టే ప్రయత్నంలో ఉన్నారు. ఈ నెక్ టై తాడేమిటి?" డైనింగ్ టేబుల్ కింద నించి దాన్ని తీసి కానర్స్ చూపించాడు.

"అది బాబీ పని" కిట్టీ దాన్ని చూసి చెప్పింది.

"నావి ఎందుకు తీసుకున్నావు?" అర్నాల్డ్ అసహనంగా అడిగాడు.

"నాకు తాడు కనపడలేదు. స్కౌట్స్‌లో నేర్చుకున్న ముళ్ళు ప్రాక్టీస్ చేయడానికి తీసుకున్నాను. అవి పాత టైలు నాన్నా" బాబీ చెప్పాడు.

"బుక్ షెల్ఫ్‌లోని ఉపయోగించని ఏకైక సాక్ సంగతేమిటి?" అమోస్ టై ముళ్ళని కొట్టేసి అడిగాడు.

"ఓ! నాలుగో సాక్ గురించా?" కిట్టీ అడిగింది.

"నాలుగు కాళ్ళ మనిషి ఉంటాడా?" అమోస్ ఆలోచనగా అడిగాడు.

"కాదు. జిమ్మీని కార్లో తీసుకెళ్ళడానికి నేను డాలర్ స్టోర్‌లో కొన్న రెండు జతల సాక్స్‌తో బొమ్మ చేసాను. నాలుగోది మాయమైంది. దాన్ని కనిపెట్టినందుకు థాంక్స్" కిట్టీ చెప్పింది.

"మీ ఇంట్లోకి కోసెటీ రాలేదు. స్పగెటీ కేన్స్ గురించి చెప్పండి" సాక్‌ని కూడ్ ఆకొట్టేసి అమోస్ కోరాడు.

"విన్నావుగా. వాళ్ళకి చెప్పు కిట్టీ" ఆర్నాల్డ్ ఎగతాళిగా నవ్వుతూ చెప్పాడు.

వెంటనే కిట్టీ మొహం సిగ్గుతో ఎర్రబడింది.

"చర్చ్‌లో పాట్‌లక్ సప్పర్‌కి మేమేదైనా చేసి తీసుకెళ్ళాలి. సామాను సర్దడంతో టైం లేక మా వంతుగా స్పగెటీని తీసుకెళ్ళి ఇచ్చాను" కిట్టీ చెప్పింది.

"కేన్స్ ఖాళీ చేసి, దాన్ని బౌల్‌లో వేసి దానిమీద కొంత సీజనింగ్ కలిపి నాతో చర్చ్‌కి పంపింది. అది చర్చ్‌ని మోసం చేయడమే" అర్నాల్డ్ చెప్పాడు.

"ఫ్రిజ్‌ని చెక్ చేసి చెప్పండి" అమోస్ దాన్నీ కొట్టేసి అడిగాడు.

"ఇప్పుడే చూసాను. అన్నీ ఉన్నాయి. మీ ఆధారాలు నిజంగా ఇక్కడకి ఎవరైనా వచ్చారా అన్నది సూచిస్తాయా?" కిట్టీ అడిగింది.

"మీ మంచాల మీది దుప్పట్లు నలక్కుండా ఎందుకు అంత శుభ్రంగా ఉన్నాయి? కత్తిరించిన ఈ పత్రికల మాటేమిటి?" డిటెక్టివ్ డీన్‌లో పరకాయ ప్రవేశం చేసిన అమోస్ అడిగాడు.

"పక్కలు శుభ్రంగా లేకపోతే మా ఆవిడ చంపేస్తుంది. పెళ్ళైన రాత్రి నించి నాకు, చిన్నప్పటినించే పిల్లలకి శిక్షణ ఇచ్చింది" ఆర్నాల్డ్ చెప్పాడు.

"బాబీ జంతువుల బొమ్మలు కనపడితే చాలు. కట్ చేసేస్తాడు. మా వారు డిస్కౌంట్ కూపన్స్‌ని కట్ చేసేస్తారు. ఇది వాళ్ళిద్దరి పని" కిట్టీ వాళ్ళిద్దరి వంకా కొద్దిగా కోపంగా చూస్తూ చెప్పింది.

"లివింగ్ రూములోని ఆస్ప్రిన్ సీసాలని ఎవరు ఖాళీ చేసారు?"

"అవి నా మరిది జిమ్‌వి. మా ఇంట్లో టి.వి చూసినప్పుడల్లా వాటిని వాడుతూంటాడు వాటిని చెత్త బుట్టలో వేసే టైం నాకు లేకపోయింది. చెత్తబుట్టలో వేయాల్సినవి చాలా ఉన్నాయి. మమ్మల్నీ ప్రశ్నలు ఎందుకు అడుగుతున్నారు?" కిట్టీ విసుగ్గా అడిగింది.

ఎవరూ దానికి జవాబు చెప్పలేదు. ఆ గదిలో అందరికీ ఇబ్బందిగా ఉందని గుర్తించిన అమోస్ తన కాగితంలోని ఆకరి రెండు ఆధారాలని చూసుకుని అడిగాడు.

"మేధావులు చదివే ఆరు పుస్తకాలు బుక్ షెల్ఫ్‌లో కాకుండా లివింగ్ రూం టేబుల్ మీద ఎందుకు ఉన్నాయి?"

"వాటిని ఎవరూ చదవలేదు. ఆఫీస్ నించి వచ్చిన తన కొలీగ్‌కి ఆర్నాల్డ్ ప్రొజెక్టర్‌లో కొన్ని బొమ్మలని చూపించాడు. ఎత్తు కోసం దానికింద ఆ లావు పుస్తకాలని పెట్టాడు" కిట్టీ పకపక నవ్వి చెప్పింది.

"ఇది?" అమోస్ కొద్దిగా విచారంగా కోడ్ కాగితాన్ని ఇచ్చాడు.

"ఇది మీకు ఎక్కడ దొరికింది?" కిట్టీ ఆశ్చర్యంగా అడిగింది.

"ఓ కుర్చీ కింద"

"ఇది పాతది. ఇది టొమాటోస్, మయానీస్, లెట్యూస్, ఐడాహో పొటాటోస్, బటర్, ఆస్పరాగస్, సేండ్‌విచ్ బాగ్స్... ఇది సరుకుల జాబితా. దీన్ని ఏమనుకున్నారు?"

తను కోడ్ అనుకున్నానని చెపితే కిట్టీ నవ్వుతుందని అమోస్ చెప్పలేదు. తన ఆధారాల కాగితాన్ని మధ్యకి మడిచి నాలుగు ముక్కలు చేసాడు.

అమోస్ ఎవరికీ గుడ్ బై కూడా చెప్పకుండా చల్లగా జారుకున్నాడు.

ఉత్తరాలని చూస్తూ కిట్టీ చెప్పింది.

"వెధవ ఫోన్ కంపెనీ. మళ్ళీ తప్పు బిల్‌నే పంపింది. కెంటకీలోని పేరిస్ అనే ఊళ్ళో మనకి ఎవరూ తెలీదు. ఐనా లాంగ్ డిస్టెన్స్ ఫోన్ బిల్ ఎలా వేస్తారు?"

ఫర్లే దాన్ని అడిగి తీసుకున్నాడు.

మర్నాడు ఫార్లే అమోస్ ఇంటికి వచ్చి చెప్పాడు.

"ఈ కేస్ గురించి మీకో తాజా సమాచారం. మీ పక్కింట్లో దాక్కుంది మేథ్యూ హూస్. అతనికి ఇష్టంలేకపోయినా వాళ్ళిద్దరితో కలిసి పారిపోయాడు. వాళ్ళు నచ్చక విడిపోయాడు. ఆర్నాల్డ్ ఇంటి వెనక పాలవాడి కాగితాన్ని చదివి ఇంటి లోపలికి వెళ్ళి ముప్పై ఒకటో తారీకు రాత్రి కెంటకీ లోని తన తల్లికి ఫోన్ చేసి డబ్బడిగాడు. అతను దొంగ కాదు. ఆర్నాల్డ్ అడ్రస్‌కి తల్లి డబ్బు పంపాక తను ఫ్రిజ్‌లో ఖాళీ చేసిన వస్తువులన్నీ మళ్ళీ కొని ఉంచి రైల్వే స్టేషన్‌కి వెళ్ళాడు. అక్కడ అతన్ని అరెస్ట్ చేసారు. ఆర్మీ అలవాటు ప్రకారం నిద్రలేవగానే పక్కని సరిచేసేవాడు."

"కల్పనకి, నిజానికీ తేడా ఇప్పుడు నాకు అర్ధమైంది. డేనియల్ డీన్ నేను అనుకున్నంత గొప్ప డిటెక్టివ్ కాదు."

తను రాసే కాగితంలోకి చూసాడు.

"హంతకుడు రెండు చేతులూ ఉపయోగించేవాడై ఉండాలి.." డేనియల్ డీన్ చెపితే ఇన్‌స్పెక్టర్ మెచ్చుకోలుగా చప్పట్లు కొట్టాడు.

ఆ ఇద్దరు పోలీసులకి, పక్కింటివాళ్ళకి తను జోకర్లా కనిపిస్తున్నాడని అమోస్‌కి తెలుసు.

(వచ్చేనెల మరోకథ)

Post your comments